రేపు ఉచిత వైద్య శిబిరం

మణికొండ: లివర్‌కు పూర్తి స్థాయిలో పరీక్షలు నిర్వహించి జాగ్రత్తగా ఉంచుకోవాలని డాక్టర్ ప్రభుకుమార్ చల్లగాలి అన్నారు. మణికొండలోని చైతన్య కాలనీలోని ఆయన క్లినిక్‌లో ఆదివారం లివర్ క్లినిక్ వారు అధునాతన ఫైబ్రోస్కాన్ యంత్రంతో ఉచిత పరీక్షలు చేపడుతున్నామని తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. మణికొండ మున్సిపాలిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 98497 05534లో సంప్రదించవచ్చు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు

మణికొండ: ఇంటి ముందు ఉంటున్న ఓ వివాహితను వేధించిన వ్యక్తిపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. నార్సింగి సీఐ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్‌షాకోట్‌కు చెందిన సుదర్శన్ తన బంధువైన ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించడం, తన కామవాంచ తీర్చాలని వేధించడంతో ఆమె భరించలేక నార్సింగి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆమె ఆరోపణలు సరైన వేనా, వారు బంధువులే కావటంతో ఇంకేమైనా ఆస్తి తగాదాలు ఉన్నాయా..అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా అతడిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

- రోడ్డుకు ఇరువైపులా ట్రక్కులు, లారీలను పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- వాహనాలను అడ్డం పెట్టుకొని భూములను కబ్జా చేసేందుకు యత్నం


రోడ్డుకు ఇరువైపుల పార్కు చేసిన వాహనాలు

అత్తాపూర్: పీవీ నరసింహారావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డుకు ఇరువైపులా వ్యాపారస్తులు ఎక్కడ పడితే అక్కడ లారీలను, వాహనాలను పార్కింగ్ చేస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. గృహ నిర్మాణాలకు ఉపయోగించే ఇసుక, ఇటుక, కంకర, గ్రానైట్ రాయి తదితర వస్తువులను క్వారీల నుంచి స్థానికంగా డంప్ చేసి విక్రయించేవారు. కొందరు అయితే క్వారీల నుంచి తీసుకొచ్చి నేరుగా వినియోగదారుడికి చేరవేస్తూ హైదర్‌గూడ, అత్తాపూర్, ఉప్పర్‌పల్లి వరకు ట్రక్కులు, లారీలను పార్కింగ్ చేస్తున్నారు. గతంలో ఎప్పుడులేని విధంగా ఈ మధ్య కాలంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ ప్రధాన కార్యాలయం వద్ద, పిల్లర్ నంబర్ 162 ప్రాంతంలో వాహనాలు అక్రమంగా చేస్తూ ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వాహనాలను అడ్డం పెట్టుకొని కొంతమంది స్వార్థపరులు కోట్లాది రూపాయల విలువ కలిగిన భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. స్థానికంగా ఉన్న జీఎస్టీ సమీపంలో ఉన్న విలువైన స్థలాల్లో గుట్టు చప్పుడు కాకుండా చదును చేసుకుంటున్నారు. ఇలాంటి వారిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..



ప్రధాన రహదారులపై అక్రమంగా పార్కింగ్ చేసే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయం ప్రాంతం, పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ ఎలివేటేడ్‌వే, 162 పిల్లర్ ప్రధాన రహదారికి ఇరువైపులా అక్రమ పార్కింగ్‌లతో ప్రజా రవాణా వ్యవస్థకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. తీరు మార్చుకొని ట్రక్కులు, లారీలకు యజమానులకు నోటీసులు ఇచ్చి అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తాం.

– బోసు కిరణ్, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

కబ్జా స్థలాలను స్వాధీనం చేసుకుంటాం..



ప్రభుత్వ స్థలాలు, ఆక్రమణలకు గురైతే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. ఆక్రమణకు గురైన స్థలాలను స్వాధీనంలోకి తీసుకుంటాం. నిర్మాణాలు చేపట్టిన వాటిని కూల్చివేయడం జరుగుతుంది. దీంతో ఆర్థికంగా మీకే నష్టమని తెలుసుకోండి. రాజేంద్రనగర్ పట్టణ పరిధిలో ప్రభుత్వ స్థలాలపై డేగ కన్ను వేసి ఉన్నాం. ఎప్పటికప్పుడు కబ్జాల పరంపరపై సమాచారం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

– రాములు, రాజేంద్రనగర్ తహసీల్దార్

మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయం


బస్తీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ గోల్డెన్ హైట్స్ కాలనీలో శుక్రవారం ఆయన నాయకులు, కార్యకర్తలు, అధికారులతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్, రాజేంద్రనగర్ పార్టీ ప్రధాన కార్యదర్శి పలుగు చెరువు మహేశ్, జీహెచ్‌ఎంసీ ఈఈ నాగేందర్, వాటర్ వర్క్స్ అధికారులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా బీజేపీ హవా

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


విజయ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

మణికొండ: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే దేశ వ్యాప్తంగా బీజేపీ, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హవా కొనసాగుతుందని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్ర నార్సింగి మున్సిపాలిటీలో కొనసాగటంతో అందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన దేశాన్ని, ప్రజలను ఉన్నతంగా ఉంచాలని ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పదేళ్లుగా పనిచేస్తున్న ఘనత నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. బీజేపీలో ఒక్కో ఎంపీ సీటుకు ఇద్దరు, ముగ్గురు పోటీ పడుతుండగా అదే బీఆర్‌ఎస్ పార్టీ నుంచి తాము పోటీ చేయలేమని పారిపోతున్నారన్నారు. అధికారంలోకి రాక ముందు బీఆర్‌ఎస్ అంతుచూస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు ఆ విషయాన్నే మర్చిపోయిందన్నారు. వారికి చేవెళ్లలో అభ్యర్థి లేక ఇతర పార్టీ నుంచి తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో బీజేపీకి ఈసారి 400 సీట్లు వస్తాయని, అందులో తెలంగాణ నుంచి 15 సీట్లు ఉంటే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. విజయ సంకల్ప యాత్ర నార్సింగి, కోకాపేట, ఖానాపూర్, వట్టినాగులపల్లి మీదుగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోకి వెళ్లింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, రాష్ట్ర నాయకుడు అంజన్‌కుమార్‌గౌడ్, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు సీహెచ్. భిక్షపతి యాదవ్, కోకాపేట కౌన్సిలర్ ఆదిత్యారెడ్డి, మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి సహకరించండి


ప్రదీప్‌కుమార్‌ను సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులకు సమాన నిధులను కేటాయించి వాటి అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు కమిషనర్‌ను కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో గతంలో వార్డుల వారీగా కేటాయించిన నిధులు, తమ వార్డులలో తక్కువ నిధులు కేటాయించిన విషయాన్ని వారు ఆయన దృష్టికి తెచ్చారు. రాబోయే రోజుల్లో అయినా అన్ని వార్డులలోని ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని పనులను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వసంతరావు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, నాయకులు జయరాజ్, బషీర్, రాజిరెడ్డి, భరత్‌రెడ్డి, శ్రవణ్ కుమార్, నరేందర్, బాలాజీ, కిరణ్, రాజేంద్రప్రసాద్, లక్ష్మీశ్రీ, విజయలక్ష్మి, శివగంగ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ నరేంద్ర మోదీయే ప్రధాని

నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: భారత ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి గద్దెనెక్కడం ఖాయమని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎంఎల్ గార్డెన్‌లో బీజేపీ 4వ రోజు విజయ సంకల్ప యాత్రలో భాగంగా విలేకర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మోదీ నాయకత్వంలోనే భారత్ ఒక బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతుందన్నారు. తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల అవినీతి పాలనకు ప్రజలు చమరగీతం పాడారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అవినీతిని ప్రోత్సహిస్తున్నదని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అక్రమాల మీద కుంభకోణాల మీద సీబీఐ విచారణ జరిపిస్తా అన్న రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఆ విషయాన్ని మరిచిపోయి గత ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్నాడని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి గత ప్రభుత్వంలో చేసిన అన్యాయాలు, అక్రమాలు, కబ్జాలు అన్ని ఆధారాలతో సహా నిరూపిస్తామని అన్నారు. కొండ విశ్వేశ్వర్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని క్షమాపణలు చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాణి రుద్రమాదేవి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మల్లారెడ్డి, శ్రీధర్, అడికె జనార్దన్, మల్లేష్‌యాదవ్, డాక్టర్ ప్రేమ్‌రాజ్, నిఖిల్, మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో గుండెపోటుతో వృద్ధుడి మృతి


దశరథ్ (ఫైల్)

రాజేంద్రనగర్: ఇంటిని తాము కొనుగోలు చేశామని ఖాళీ చేయాలని తెలపడంతో మాటలు కాస్తా ఘర్షణగా మారాయి. దీంతో ఓ వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మౌనిక తెలిపిన వివరాల ప్రకారం..హైదర్‌గూడ కృష్ణానగర్ కాలనీకి చెందిన దశరథ్ (60) డ్రైవర్. ప్రస్తుతం ఇంటి వద్ద కిరణా షాపును నిర్వహిస్తున్నాడు. గతంలో కూకట్‌పల్లికి చెందిన పుల్లయ్య వద్ద ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి దస్తావేజులను జీపీఏ చేసి డబ్బు తీసుకున్నాడు. ప్రస్తుతం వీరి మధ్య ఏడేళ్లుగా వివాదం నడుస్తుంది. పుల్లయ్య ఈ ఇంటిని రోహిత్‌రెడ్డి, అశ్వినిలకు విక్రయించారు. దీంతో రోహిత్, అశ్వినిలు తమ అనుచరులతో గురువారం సాయంత్రం కృష్ణానగర్ కాలనీలోని దశరథ్ ఇంటికి చేరుకొని తాము కొనుగోలు చేశామని ఖాళీ చేయాలని తెలిపారు. దీంతో దశరథ్, రోహిత్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం సాగింది. దశరథ్‌కు గుండె జబ్బు ఉండటంతో కుప్పకూలాడు. ఆసుపత్రికి తరలించగా.. డాక్టర్లు మృతి చెందాడని తెలిపారు. దీంతో దశరథ్ కుమారుడు శ్రీకాంత్ శుక్రవారం ఉదయం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం దశరథ్ అంత్యక్రియలు పూర్తయ్యాయని ఎస్సై మౌనిక తెలిపారు. దశరథ్ కుటుంబ సభ్యులతో పాటు పుల్లయ్య, రోహిత్ రెడ్డిలను విచారిస్తే అసలు విషయం తెలుస్తుందని ఎస్సై మౌనిక తెలిపారు.

మినీ బస్సు టెర్మినల్ బస్టాండ్ నిర్మించాలి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: ఆరాంఘర్ చౌరస్తాలో మినీ బస్సు టెర్మినల్ బస్టాండ్ నిర్మించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, డి.అనంత మోహన్‌లు కోరారు. శుక్రవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2017లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పని చేసిన రఘునందన్‌రావు కాటేదాన్ సర్వే నంబర్ 54, 55లో 7 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ భూమిని అధికారులతో సర్వే చేయించారన్నారు. 2018లో కలెక్టర్ లోకేశ్ కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆర్టీసీకి ఇస్తున్నట్లు జీవో విడుదల చేయడం జరిగిందన్నారు. మినిస్టర్ అన్ని వివరాలు ఇవ్వడం జరిగిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ ఆర్టీసీ అధికారులకు మినీ టెర్మినల్ బస్టాండ్ కట్టాలని ఆదేశాలు ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యేసు రత్నం, మద్దిలేటి దదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ గుట్టపై ప్రారంభమైన జాతర



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మానస హిల్స్‌లోని సమ్మక్క సారలమ్మ గుట్టపై శుక్రవారం జాతర ప్రారంభమైంది. జంట నగరాలు, నలుమూలల నుంచి భక్తులు ఈ ప్రాంతానికి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బంగారాన్ని సమర్పించారు. జాతర సందర్భంగా సమ్మక్క సారలమ్మ గుట్టపై భక్తులతో కిటకిటలాడింది. నీరుడు శ్రీరాములు ముదిరాజ్ కుటుంబ సభ్యులు సమ్మక్క సారలమ్మకు పూజలు నిర్వహించి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు తమ కోరికల మేరకు బంగారాన్ని సమర్పించి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులతో పాటు రాజేంద్రనగర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం జాతర ముగియనుంది.

‘క్రిడా’లో ముగిసిన జాతీయ సెమినార్


మాట్లాడుతున్న డాక్టర్ ఏ.కే.సింగ్


సెమినార్‌లో ఉత్తమ పోస్టర్ అవార్డులు అందుకున్న విద్యార్థులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రిడా)లో సుస్థిర వ్యవసాయం, పర్యావరణ కోసం స్మార్ట్ టెక్నాలజీస్‌పై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సెమినార్‌లో పాల్గొన్న ప్రముఖులు, నిపుణులు వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థలో అత్యాధునిక డిజిటల్ సాంకేతికలను సమగ్రపరచడం, కృత్రిమ మేధస్సు, బిగ్ డేటా అనలిటిక్స్, డ్రోన్లు, రిమోట్ సెన్సింగ్, సెన్సార్లు, కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్‌లతో సహాయ సహజ వనరుల నిర్వహణలో వ్యవసాయ డిజిటైజేషన్ అంశాలను సమర్పించి చర్చించారు. రైతులు, శాస్త్రవేత్తల పరస్పర సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ముగింపు సందర్భంగా ఐసీఏఆర్–క్రీడా డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సింగ్ సెమినార్ వివిధ కేటగిరీ ప్రదర్శనలు, ఆహ్వానిత ఉపన్యాసాలు, మౌఖిక, పోస్టర్ సెషన్‌లను సభకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీఏఆర్ (ఎన్ఆర్ఎం) డీడీజీ డాక్టర్ ఎస్.కె.చౌదరి మాట్లాడుతూ..రెండు రోజుల సెమినార్ సిఫార్సుల ఆధారంగా స్మార్ట్ టెక్నాలజీలను ఉపయోగించి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని ఆయన ప్రతినిధులకు సూచించారు. అనంతరం అగ్రోఫిజిక్స్‌లో మాజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎస్.రావును ఘనంగా సత్కరించారు. అనంతరం గ్వాలియర్ ఆర్‌వీఎస్‌కేవీవీ మాజీ వైస్ చాన్సిలర్ డాక్టర్ ఎ.కె.సింగ్ మాట్లాడుతూ..సెమినార్‌లో చర్చించిన స్మార్ట్ టెక్నాలజీలను ఉపయోగించేందుకు ప్రణాళికలను రూపొందించాలని ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ పోస్టర్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఏపీ ప్రగతి ఫర్మానిక్ మైతీ సెక్రటరీ డాక్టర్ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి

గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కాకపోయిన కూడా వేల సంఖ్యలో పర్యాటకులు కోటకు తరలివచ్చారు. ఉదయ ం 8 గంటల నుంచే కోటలోని నగీనాబాగ్, రాణిమహల్, ఆయుధాగారం తదితర ప్రాంతాలు పర్యాటకులతో నిండిపోయాయి. ఆయుధాగారంలోని కుతుబ్‌షాహి రాజుల నాటి కత్తులు, ఫిరంగులు, తదితర ఆయుధాలను చూసి పర్యాటకులు ఆశ్చర్యపోయారు. అక్కన్నమాదన్న కార్యాలయం దాని గోడలు, విశాలమైన ప్రాంగణం చూసి ఔరా అనాటి రాజసం అంటూ విస్తుపోయారు. వేల సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులతో గోల్కొండ కోటతో పాటు కోట మెయిన్ గేట్ ముందు ఉన్న రెస్టారెంట్లు, గిఫ్ట్ షాపులు కిటకిటలాడాయి.

‘మనూ’లో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోర్సులకు గడువు పెంపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పార్ట్ టైమ్ పీహెచ్‌డీ కోర్సుల దరఖాస్తుకు గడువు తేదీని పొడిగించినట్లు యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ శుక్రవారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ పీహెచ్‌డీలో కూడా ప్రవేశాలు అందుబాటులో ఉంటాయని,దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారానే సమర్పించుకోవాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 25వ తేదీ వరకు స్పాన్సర్డ్/సెల్ఫ్–ఫైనాన్సింగ్ మోడల్‌లో పార్ట్‌టైమ్ కోర్సులు ఉన్నాయన్నారు. ప్రవేశ పరీక్ష షెడ్యూల్ ప్రకారం మార్చి 8వ తేదీన జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ కమ్ అప్లికేషన్ రుసుము రూ.1500 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రైతులు, విద్యార్థులకు అవగాహన

రాయదుర్గం: వాతావరణ మార్పు, స్థిరత్వం అంశాలపై రైతులకు, విద్య ప్రాముఖ్యతను విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని సెంటర్ ఫర్ ఎర్త్, ఓషన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్(సీఈఓఏఎస్) విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పర్యటన జరిపారు. హెచ్‌సీయూ ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం సమీపంలోని మంచాల్ మండలం రంగాపూర్‌లో పర్యటించారు.రైతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాసంఘాలతో వారు మాట్లాడారు. చార్టులు, పోస్టర్ల సహకారంతో వారిలో అవగాహన కల్పించారు.

పార్కు ప్రహరీ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శ్రీకాంత్ స్వామి

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లోని పార్కులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మణికొండ మున్సిపాలిటీ, 9వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి అన్నారు. శుక్రవారం తన వార్డు పరిధిలోని నేతాజీపార్కు ప్రహరీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న పార్కులలో కొన్నింటిని ఇప్పటికే నందన వనాలుగా తీర్చిదిద్దామని, రాబోయే రోజుల్లో మిగిలినవి అభివృద్ధి చేస్తామన్నారు. వాటిల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. గతంలో భారీ వర్షాలతో నేతాజీ పార్కు ప్రహరీ కూలిపోయిందని, ప్రస్తుతం దాన్ని తిరిగి నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ధీరజ్ పాల్గొన్నారు.

నేడు పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన

గోల్కొండ: 24వ తేదీన పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ షేక్‌పేట్ మండల అధ్యక్షుడు మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. షేక్‌పేట్‌తో పాటు గోల్కొండ మండలాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. టోలిచౌకి టూంబ్స్ రోడ్‌లోని గోల్డెన్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. విద్యా రంగంలో పేరుగాంచిన కౌన్సిలర్లు విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పిస్తారని ఆయన తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా షేక్‌పేట్ మండలానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులను పంపదలచుకునే పాఠశాలల వారు 70329 07996లో సంప్రదించవచ్చు.

నవజాత శిశు సంరక్షణలో నర్సుల పాత్ర అమోఘం


కొత్తగా విధుల్లో చేరిన నర్సులతో సమావేశమైన డాక్టర్ ఉషారాణి

నాంపల్లి: నవజాత శిశు సంరక్షణలో నర్సుల సేవలు అమోఘమైనదని, కొత్తగా ఎంపికై విధుల్లో చేరిన నర్సులు మాతా శిశువులతో స్నేహపూర్వకంగా మెలగాలని నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా 192 మంది నర్సులు విధుల్లో చేరారు. ఈ మేరకు శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి నర్సులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నర్సులు విధుల పట్ల అనుసరించాల్సిన వైఖరిని ఉపదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి, నర్సింగ్ విభాగం అధికారిణి స్వరూప, విజయలక్ష్మి, మ్యాట్రన్స్ ఇందిరా, ఆశీర్వాదం, సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

మియాపూర్: వర్షాకాలంలో వరదనీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎ.ఎస్.రాజునగర్, మహాధాయ ఎన్‌క్లేవ్ కాలనీలలో గత వర్షాకాలంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా నూతనంగా వరదనీటి కాలువ నీటి నిర్మాణం చేపట్టబోయే పరిసర ప్రాంతాలను స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎఎస్‌రాజునగర్, మహోదా ఎన్‌క్లేవ్ కాలనీలో గత వర్షాకాలంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా నూతనంగా వరదనీటి పనులు చేపట్టే పరిసర ప్రాంతాలను కాలనీ వాసులతో కలిసి పరిశీలించామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రావు, రాజు, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.